# వాళ్ళు ప్రేమికులు!

గంగమ్మ గౌరీసుని ప్రేమించిందా గౌరీసుడు గంగమ్మను ప్రేమించాడా అన్నది ఆలోచించ దలుచుకోలేదు రావు.

ముందు గంగమ్మే గౌరీసుని ప్రేమించినా గౌరీసే ముందు గంగమ్మని ప్రేమించినా మొత్తంమీద వాళ్లు ప్రేమికులన్న నిర్ణయానికి వచ్చేడు రావు.

గంగమ్మ గౌరీసు ఇంతగా ప్రేమించుకుంటారని రావు ఎప్పుడూ ఊహించలేదు.

ప్రేమకి జాతి, మతి, వర్గ విచక్షణ లేదన్న సంగతి అతనికి తెలియక కాదు— కాని—

దొంగఅంటే నల్లగా బలంగా కండలు తిరిగి వుంటాడనీ, కథానాయిక అంటే ఎంతో అందంగా ఆకర్షణీయంగా వుంటుందనీ; స్టంటు పిక్చర్లో కథానాయకుడంటే ఎన్ని దెబ్బలుతిన్నా చివరకు బ్రతికేవాడనీ ఒక దృఢవిశ్వాసం వున్నట్టే, ప్రేమఅంటే యౌవనంలోవున్న ఓ అందమైన అమ్మాయి మరో అందమైన అబ్బాయితో సరస సల్లాపాలాడుతూ పార్కులోనూ, సముద్ర పొడునా తిరగడమే నన్న దృఢభావంతో వుండేవాడు రావు.

అంచేత వయసులోవున్నా, సింహాచల స్వామి మొక్కుబడి కారణంగా మగవాడి క్రాపులా జుత్తు దగ్గరకి కత్తిరించుకుని, నల్లటి శరీరంతో మాసినబట్టలతో వుండే గంగమ్మ, ముప్పైఏళ్లు పైబడి మొద్దులాగ వుండి ఇంకా నిక్కరులోనే తిరిగే గౌరీసు ఒకర్నొకరు ప్రేమించుకుంటారని ఊహించలేక పోయేడు రావు.

గంగమ్మ, రావువాళ్లింటో ఎనిమిది సంవత్సరాలనుంచి పనిచేస్తుంది. గౌరీసు, రావు వాళ్ళ పక్కింట్లో కొత్తగా దిగిన ఇంకంటాక్సు ఆఫీసరుగారింటో పని చేస్తున్నాడు. ఇంటిముందు కుళాయి వున్నా రెండుబిందెలు నీళ్లు పట్టుకోవడమే కరువైనందున గౌరీసు, రావు వాళ్లింట్లో నూతినీళ్లు తోడిపట్టుకు వెళ్తుండేవాడు.

రావు ఉద్యోగంచేస్తున్నా, కనీసం తనకి వివాహ మయివున్నా గంగమ్మ గౌరీసుల ప్రేమనుగురించి పట్టించుకునేవాడు కాడేమో. కాని పుస్తకాలతో కుస్తీపట్టి యిరవై మూడు వెళ్లి యిరవైనాలుగు ప్రవేశించిన ఇన్నాళ్ళకి బియ్యే పాసయి ఉద్యోగాన్వేషణలో వున్నాడు.

ఉద్యోగానికి తిరుగుతున్న రావుకి ఎక్కడా ఉద్యోగం కనపడకపోయినా, ప్రతిచోటా ప్రేమ కనపడ్డం మొదలు పెట్టింది.

ఊసుపోక చదివిన కథల్లోనూ నవల్లోనూ ప్రేమ.

సాహిత్య జ్ఞానంకోసం చదివిన కావ్యాల్లో ప్రేమ.

జనరల్ నాలెడ్జికోసం చదువుతున్న పేపర్లోనూ ప్రేమవార్తలే.

ఇక ఊళ్లోకివస్తే,—

రిక్షాల్లో, కారులో ప్రేమ.

బీచీలో ప్రేమ.

సినిమాల్లో ప్రేమ.

చెవులు చిల్లులుపడేట్టు వేసే సినిమా పాటల్లో ప్రేమ.

ఎక్కడచూసినా ప్రేమ!

ఇన్నాళ్లూ ప్రేమని తను చూడలేదా? చూసినా గుర్తు పట్టలేదా అన్న భావం కలిగింది రావుకి.

## కీర్తిప్రియ

కాని ఇప్పుడుమాత్రం రావు ప్రేమికుల చూపులకీ, వాళ్ల సంభాషణలకీ, వాళ్ల చేష్టలకీ అర్థాలు చెప్పకలుగుతున్నాడు.

ఓ నాడు మధ్యాహ్నం నిద్రలేచి మొహం కడుక్కోబోతూ తన గదిదగ్గర నుండి పెరటో నూతివైపు చూసేడు రావు. గంగమ్మ నోట్లో చుట్టపెట్టుకుని నిలబడి వుంది. గంగమ్మయెదుట నిలబడి గౌరీసు దాని చుట్టతో తనచుట్ట కాల్చుకోబోతున్నాడు. చుట్ట సరిగా కాలుతున్నట్టు లేదు. అందుకని ఎడమచేతితో గంగమ్మ తలను ముందుకులాగి చుట్ట వెలిగిస్తున్నాడు. గంగమ్మ రెండు చేతులతోనూ గౌరీసుని ఒక్కతోపు తోసింది.

గౌరీసు నూతిచప్టామీద పడ్డాడు. గంగమ్మ నవ్వడం మొదలుపెట్టింది. గౌరీసుకూడా దుమ్ము దులుపుకుంటూ లేచి నవ్వుతున్నాడు. ఇంతలో రావు అటువైపు చూస్తుండడం చూసి వాళ్లు సిగ్గుపడి ఎవరి పనిలోకి వాళ్ళు పోయేరు.

రావు అప్పటికి గంగమ్మ గౌరీసులు ప్రేమికులని ఓ నిర్ణయానికి వచ్చేడు. ఇంతకుముందు గంగమ్మ గౌరీసుల మధ్య ఇలాంటి సంఘటనలు చాలా చూసేడు. ఒకళ్ళ మొహాలు ఒకరు చూసుకుంటూ పకపక నవ్వుకోడం; చీపురుపుల్లలతోటి చింతపిక్కలతోటి ఒకర్నొకరు కొట్టుకోవడం; తోడుతూ తోడుతూ నీళ్లు జల్లుకోవడం; ఒకర్నొకరు వెక్కిరించుకోవడం; ఒకరి పనులు ఒకరు చేసిపెట్టడం యిలా రకరకాలుగా ప్రవర్తించేవారు. అప్పుడు ఈ చేష్టలకి ఇంత విపరీతమైన అర్థముంటుందని అనుకోలేదు రావు.

గంగమ్మ గౌరీసుల చేష్టల కర్థం బోధపడి పోయినతర్వాత రావు ఇంక వాళ్ళలో ముందు ఎవర్ని ఎవరు ప్రేమించివుంటారని ఆలోచించడం మానేసేడు. ఆ ఆలోచన అనవసరం అనిపించింది. తనకిగాని, లోకానికిగాని కావలసిందల్లా గంగమ్మ గౌరీసులు ప్రేమికులన్న సత్యం ఒక్కటే.

గంగమ్మ గౌరీసుల్ని రోజూ గమనిస్తున్న రావు 'చివరికి వీళ్ళేదో ప్రమాదం తెచ్చిపెట్టుకుంటారే' అనుకున్నాడు.

రావు అనుకున్నంత పనయింది. ఓ నాడు గంగమ్మ పనిలోకి రావడం మానేసింది. ఎంతో టికలుతీసే పనివుంటేతప్ప 'నాగా' అయినా పెట్టకుండా నిత్యం పనిచేసే గంగమ్మ రాకపోయేటప్పటికి రావు వాళ్లమ్మకి చెయ్యి తెగినటయింది. ఇటూ అటూ చిందులు తొక్కుతూ తిడుముల్లాడుతూ తిరుగుతుంది ఆవిడ. ఎప్పుడేనా మానేయవలసివస్తే, ఎవరితోనైనా కబురు పంపించేది. వీలైతే ఏ అమ్మనైనా సాయంచేసిపెట్టమని బతిమాలి పనిలోకి పంపించేది. అలాంటిది ఆ వేళ ఎనిమిది గంటలయినా ఏ కబురూ లేదు.

'వెళ్ళి ఆ గంగమ్మముండ వచ్చిందీ రాందీ కనుక్కో నాయనా. రావంటే ఈ వేళకి గౌరీసునైనా బతిమాలాం. అది రాలేదని కాబోసు ఈ వేళ వాడూ ఇంకా రాలేదు' అని చిన్నబ్బాయిని పంపించింది రావు వాళ్ల అమ్మ.

ఇంతలో ఇన్కమ్టాక్సు ఆఫీసరుగారి చిన్నమ్మాయి 'మా గౌరీసుగాని యిటొచ్చాడటండీ? పొద్దుటినుంచీ ఎక్కడా కనపడలేదు' అని అడిగింది.

'ఏమోనమ్మా. మా పనిమనిషీ ఎగొట్టింది. ఇంకా మీ గౌరీసుని కావిన్ని నీళ్ళు తోడి పెట్టమందా మనుకున్నాను. అన్నట్టు గౌరీసు ఎప్పుడూ మీ ఇంట్లోనే వుంటాడు

(55-వ పేజీ చూడండి)

# వాళ్లు ప్రేమికులు !

(23 వ పేజీ తరువాయి)

కదా ఎక్కడికిపోయేదు చెప్పకుండాను?' అంది రావు వాళ్ళమ్మ.

'ఏమోనండి' అంటూ ఇంటికి వెళ్ళిపోయింది ఆ అమ్మాయి.

'అమ్మ దానికటా జ్వరమట. మరి... రాలేనందమ్మా. ఈ పేళిటికి ఎలాగైనా సర్దుకోవాలట' అన్నాడు గంగమ్మను పిలవడానికి వెళ్ళిన చిన్నబ్బాయి.

'దాని మొహం. ఈ వేళ ఇంత చాకిరీతోనూ ఎలా చావడం' అని విసుక్కుంటూ వంటింటివైపు వెళ్లింది రావు వాళ్ళమ్మ.

'అమ్మ వెండిగిన్నె, వెండిపళ్ళెం, అదీ కనపడ్డంలేదు' అంది రావు పెద్దచెల్లి.

'అయ్యో అయ్యో ఆ కొట్టుగదిలో అక్కడా జాగ్రత్తగా చూసావటే? వెతుకమ్మా! వెతుకు! ఏమైపోతాయి అవే వుంటాయి తల్లీ,

'అంతటా చూశానమ్మా. కాఫీ తపేలా అవి తీసేటప్పుడు అవి కనపడకపోతే, కొట్టుగది అదీ వెతికాను. ఎక్కడా కనపడలేదు.

ఇంతలో రావు వాళ్ళ నాన్న 'చూడు' ఈ నాగరాజుగారింట్లో వెండిసామాను పోయిందట. ఆ పని పుత్రాడు గౌరీశే చేసి వుంటాడని అనుకుంటున్నారు' అంటూ వంటింటివైపు వచ్చేడు.

'అయ్యో. అయ్యో ఇక వెవడు వాడి పనే. మనింట్లో వెండి సామాను కూడా పోయిందండీ' అంది రావు వాళ్ళమ్మ.

'మన పనిమనిషొచ్చిందా?'

'లేదండి. జ్వరమని రాలేనందటండీ.'

'జ్వరంలేదు. ఏంలేదు. ఆ వెండి సామాను కొట్టా వాడికందిచ్చి జ్వరం వంక పెట్టి ఇంటి దగ్గర చతికిలబడి వుంటుంది. ఈ వేళ వూరుకుంటే అది కూడా ఉడాయించి వాణ్ణే వూరిలోనో కలుసుకుంటుంది. ఎలాగైనా రమ్మన్నారని అసలు సంగతి చెప్పకుండా దాన్ని తీసుకురండి' తమ చుట్టూ మూగి వింటున్న పిల్లలవైపు చూస్తూ అన్నారు రావువాళ్ళ నాన్న.

రావు పెదతమ్ముడు గంగమ్మను తీసుకువచ్చేడు.

"ఏమే పనిలోకి రాలేదు?" అంది రావు వాళ్ళమ్మ.

'నిన్న సాయంత్రం ఇక్కడనుండెళ్లిన దగ్గరనుండి జ్వరం కాసేస్తుందండమ్మగోరూ?'

'దొంగవేషాలువేసి దొంగకబుర్లు చెప్పావంటే చీరగొట్టేస్తాను తెలుసా? నిజం చెప్పు నువ్వు వెండిసామాను తీసేవా లేదా?'

'ఏ ఎండి సామానండి. మనెండిసామాను పోయిందేటిబాబూ?' అంది నీర్సంగా.

'ఆ గౌరీసు వెధవతో సరసాలాడి వాడికి వెండిసామాను అందించింది చాలక, ఇంకా ఏ ఎండి సామానండి అని అడుగుతున్నావా, ఏమీ ఎరగనిదానా.' రావు వాళ్ళనాన్న గంగమ్మను చెంపమీద కొట్టేరు కోపం ఆపుకోలేక.

ఆ దెబ్బకు గిజగిజలాడింది గంగమ్మ. రావు వాళ్ళమ్మ కాళ్లుచుటూ పెనవేసినట్టు పట్టుకుని 'నే నేపాపం యెరుగనమ్మా. నా పిల్లలమీదొట్టు. మీదగ్గిర పనిమిదేళ్ళనుంచీ సేత్తున్నాను ఎప్పుడైనా ఓ సీపురుపుల్ల పోయిందన్నారా? ఆ దొంగదెవడు యేసుకుపోయి వుంటాడు. నిన్న సాయంతరమే జొరమొచ్చేసిందండి, అలాపోయి తొంగున్నానండి. నన్ను రచ్చించండమ్మగోరు! నాబతుకు నిలబెట్టండి' అని ఏడవడం మొదలుపెట్టింది.

గంగమ్మ వళ్ళు జ్వరంతో కాలిపోతుంది. రావు వాళ్ళమ్మ కాళ్ళు చుర్రుమన్నాయి. నిజంగానే జ్వరం వచ్చిందనుకుంది రావు వాళ్లమ్మ. నమ్మకంగా ఎనిమిదేళ్ళనుంచి పనిచేస్తున్న దాని ననుమానించి దానిమాటలు నమ్మక జ్వరంతో వున్నదానిని భర్త కొట్టవలసి వచ్చినందుకు ఆమెకు విచారం కలిగింది.

కన్నీరు తుడుచుకుంటూ 'లే, గంగమ్మా, లే. ఆ దొంగవెధవా నువ్వూ ఇద్దరూ కనపడక పోవడాన్ని మీ రిద్దరూకలిసి చేసిన పననుకున్నాం. ఇంటికిపోయి ఇంత జావ తాగు. జ్వరంతగ్గేక పనిలోకిరా. ఈలోగా నే నెలానో సర్దుకుంటానులే' అని గంగమ్మను లేపి 'మన వెండిసామాను ఎక్కడికి పోదండి, ఆ గౌరీసుగాడిమీద పోలీసుకి రిపోర్టుయివ్వండి' అంది భర్తతో.


'ఏది అవెధవది వూరేదో వాడేదో నమ్మకంగా ఎవరికైనా తెలిస్తేనా? సంవత్సరం కిందట మీ ఇంటే పడివుండి నమ్మకంగా పనిచేసుకుంటాను పనిఇప్పించండి బాబయ్యా అని వస్తే నాగరాజుగారు వాణ్ని పనిలో పెట్టుకున్నారట' అన్నారాయన.

'సల్ల సల్లగా కబుర్లుచెప్పి పనిసాయం చేత్తూ యింట్లోవోడిలా తిరుగుతుంటే ఆడెంత మంచాడో అనుకున్నానండి. దొంగసచ్చినోడు. ఇంతిలాంటి నమ్మకద్రోహం చేత్తాడనుకోలే దండమ్మగోరు' అంది గంగమ్మ.

తానూహించినదానికి భిన్నంగా జరిగిన ఈ సంఘటన ప్రొద్దుటినుంచి మూగవాడిలా చూస్తున్న రావు ఉద్యోగ ప్రయత్నంమీద ఊళ్ళోకి వెళ్ళిపోయేడు. ★




బ్రాంచిలు: హైదరాబాదు & విజయవాడ.



## పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, నీ సరియైన దర్యనుగురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయుతేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డువ్రాసిన తేదిలగాయతు 12 మాసములలోను నీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జిలు ప్రత్యేకం) దుష్గ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.